

## ఆర్నెళ్లుగా.. ఏం చేస్తున్నవ్..?

- ఇన్ని రోజుల నుంచి? రైతు సమస్య తెలవదా?
- ఇంకెప్పుడు తెలుసుకుంటావ్?
- భూ భారతి చట్టంపై అవగాహన సదస్సులో దేవరకొండ ఆర్డీవోపై పొంగులేటి తీవ్ర ఆగ్రహం
- మంత్రి తీరుపై రెవెన్యూ వర్గాల్లో విస్మయం
- తహసీల్దార్ పరిధిలోని అంశంపై ఆర్డీవోను అడిగితే ఎలా? అని మండిపాటు

నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్ 21(నమస్తే తెలంగాణ): రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మరోసారి అధికారులపై ఆగ్రహంతో ఊగిపోయారు. ఇటీవల అకారణంగా కరీంనగర్ కలెక్టర్‌పై సీరియస్ అయిన మంత్రి.. తాజాగా నల్లగొండ జిల్లా దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డిపై అదే రేతిలో మాట్లాడటంతో రెవెన్యూ వర్గాలు విస్మయం వ్యక్తంచేస్తున్నాయి. సోమవారం నల్లగొండ జిల్లా చందంపేట మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన భూభారతి చట్టం అవగాహన సదస్సుకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ మీటింగ్‌లో భాగంగా రైతులు తమ భూ సమస్యలపై మాట్లాడేందుకు అధికారులు మైక్ ఇచ్చారు. దీంతో ఒక రైతు తన భూమి సమస్యను మంత్రికి వివరించే ప్రయత్నం చేశారు. దీనిపై వెంటనే మంత్రి స్పందిస్తూ.. సదరు రైతు సమస్యకు సమాధానం చెప్పాలని ఆర్డీవోను ఆదేశించారు. ఆ రైతు సమస్య తన దృష్టికి రాలేదని, వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని ఆర్డీవో సమాధానం ఇచ్చారు. దీంతో మంత్రి పొంగులేటి ఆర్డీవోపై ఆగ్రహం వ్యక్తంచేశారు. 'ఇక్కడ ఎన్ని నెలల నుంచి పనిచేస్తున్నావు? ఆరు నెలలుగా ఇక్కడే ఉంటున్నావు కదా? అతని సమస్య నీకెందుకు తెలవదు? ఏం చేస్తున్నావు.. ఇన్ని రోజుల నుంచి? ఇంకెప్పుడు తెలుసుకుంటావు?' అం టూ మంత్రి ఫైరయ్యారు. నిజానికి సదరు రైతు పేర్కొన్న సమస్య ఆర్డీవో స్థాయి అధికారి జవాబు చెప్పాల్సినది కాదని, మండల పరిధిలోని తహసీల్దార్ సమాధానం చెప్పాల్సి ఉంటుందని రెవెన్యూ వర్గాలు చెప్తున్నాయి. కానీ, మంత్రి మాత్రం తహసీల్దార్‌ను కాకుండా ఆర్డీవోను సమాధానం చెప్పాలని కోరడంపై రెవెన్యూ వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. అయితే విధుల్లో సమర్థుడైన అధికారిగా సదరు ఆర్డీవోకు పేరున్నట్టు రెవెన్యూ వర్గాలు చెప్తున్నాయి. ప్రభుత్వం తెచ్చిన భూ భారతి చట్టంపై దేవరకొండ డివిజన్‌లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తూ తండాల్లో ఉన్న గిరిజనులకు సైతం అర్థమయ్యేలా ఆర్డీవో రమణారెడ్డి చొరవ తీసుకుని పని చేస్తున్నారని అంటున్నారు. అధికారుల పనితీరు తెలుసుకోకుండానే ఇష్టానుసారంగా మాట్లాడటం మంత్రికి తగదని పలువురు వ్యాఖ్యానించారు. గతంలో కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతిపై కూడా ఇలాగే అకారణంగా మంత్రి సీరియస్ అయ్యారని రెవెన్యూ వర్గాలు గుర్తుచేస్తున్నాయి.



మంచినీటి కోసం మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మునిగలవీడు గ్రామస్థులు సోమవారం రోడ్డెక్కారు. నెల్లికుదురు-మహబూబాబాద్ ప్రధాన రహదారిపై సుమారు 2 గంటల పాటు ధర్నా నిర్వహించారు. - నెల్లికుదురు

## మంచినీటి కోసం మండుటెండలో ధర్నా



మంచి నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ కామారెడ్డి జిల్లా లింగంపేట మండలంలోని గాంధీనగర్‌లో కామారెడ్డి-ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై మహిళలు ఖాళీ బిందెలతో సోమవారం రాస్తారోకో నిర్వహించారు. - లింగంపేట

# ఈ ప్రభుత్వంలో దేనికీ గ్యారెంటీ లేదు

- కాంగ్రెస్ సర్కార్‌పై నారాయణఖేడ్ ఎమ్మెల్యే నిస్సహాయత
- ఓ వ్యక్తితో నీటి సమస్యపై మాట్లాడిన ఎమ్మెల్యే సంభాషణ వైరల్
- గ్రూపుల్లో ఆడియో వైరల్ చేశాడని బీఆర్ఎస్ నేత అరెస్టు



ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డి

నారాయణఖేడ్, ఏప్రిల్ 21: 'ఈ గవర్నమెంట్‌లో దేనికీ గ్యారెంటీ లేదు' అని రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై సొంత పార్టీ ఎమ్మెల్యే వ్యక్తం చేసిన నిస్సహాయత ఇది. నీటి సమస్యను తీర్చాలని కోరిన ఓ వ్యక్తితో నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డి అన్న ఈ మాటల వీడియో కాస్త బయటకు రావడంతో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సదరు వ్యక్తి, ఎమ్మెల్యేతో ఫోన్‌లో మాట్లాడుతూ నీటి సమస్యకు కారణమైన అధికారుల వేతనాలు ఆపాలని సూచించారు. అలా చేస్తే ఇంకా బద్నాం అవుతామని ఎమ్మెల్యే బదులిచ్చారు. త్వరలో రూ.2 కోట్ల నిధులు మంజూరవుతాయని, బోర్లు వేసి నీటి సమస్యను తీరుస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చా రు. ఎప్పటిలోగా బోర్లు వేస్తారని సదరు వ్యక్తి అడగడంతో 'ఎప్పటిలోగా అనేది గ్యారెంటీ లేదు' అని ఎమ్మెల్యే నిస్సహాయతను వ్యక్తంచేయడం గమనార్హం. ఇదే మాటను మరోమారు పునరుద్ఘాటిస్తూ ఈ గవర్నమెంట్‌లో దేనికీ గ్యారెంటీ లేదు.. అని స్పష్టంచేశారు. దీంతో ఎమ్మెల్యేతో ఫోన్‌లైన్‌లో ఉన్న వ్యక్తి ఎమ్మెల్యేకు చురకలు అంటించారు. ఎన్నికల సమయంలో మీరు రాసిచ్చినా బాండ్ పేపర్‌కూ గ్యారెంటీ లేదా? అనడంతో ఎమ్మెల్యే బదులిస్తూ 'ఫోన్‌లో కాదు నీ సమస్య ఏమిటో నేరుగా వచ్చి కలిసి చెప్పాలి' అని ముగించారు.



బీఆర్ఎస్ నాయకుడు కురుమ జ్ఞానేశ్వర్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

### బీఆర్ఎస్ నాయకుడి అరెస్టు

కంగ్టి, ఏప్రిల్ 21: సొంత ప్రభుత్వంపైనే నిస్సహాయతను వ్యక్తంచేస్తూ మాట్లాడిన నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి ఆడియోను వైరల్ చేశాడని ఓ బీఆర్ఎస్ నాయకుడిని సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి ఆడియోను వివిధ గ్రూపుల్లో వైరల్ చేసినందుకు సంగారెడ్డి జిల్లా ముర్కుంజాల్ బీఆర్ఎస్ నాయకుడు, తెలంగాణ జాగృతి కంగ్టి మండల అధ్యక్షుడు కురుమ జ్ఞానేశ్వర్‌ను అదుపులోకి తీసుకున్నట్టు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కంగ్టి మండల నాయకుల ఫిర్యాదు మేరకు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు ఎస్సై వివరించారు. కాగా, ఫోన్ ఆడియోలో ప్రస్తుత ప్రభుత్వం నిధుల కేటాయింపుపై తనకే నమ్మకం లేదని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి మాట్లాడిన ఈ ఆడియో రికార్డు నియోజకవర్గంలో బాగా వైరల్ అయ్యింది.



జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నంలో పిట్టల లక్ష్మి భర్త లింగన్నకు బీఆర్ఎస్ తరఫున రూ.లక్ష చెక్కును అందజేస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

## రైతు కుటుంబానికి బీఆర్ఎస్ భరోసా

- అప్పుల బాధతో ఇటీవల లక్ష్మి ఆత్మహత్య
- బీఆర్ఎస్ తరఫున లక్ష చెక్కు అందజేసిన కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 21 : సాగు కోసం చేసిన అప్పులు తీర్చలేక.. రైతు రుణమాఫీ కాక ఆందోళనకు గురై ఇటీవల పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి చెందిన రైతు పిట్టల లింగన్న కుటుంబానికి బీఆర్ఎస్ అండగా నిలిచింది. సోమవారం పార్టీ తరఫున రూ.లక్ష చెక్కును కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల అందజేశారు. బీఆర్ఎస్ రైతు ఆత్మహత్యల అధ్యయన కమిటీ సభ్యులు కొన్ని రోజుల కిందట పరామర్శించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో లింగన్న భార్య పిట్ల లక్ష్మికి బీఆర్ఎస్ తరఫున చెక్కును అందజేసి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. లింగన్న కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా బీఆర్ఎస్ అండగా నిలుస్తుందని తెలిపారు.



హనుమకొండ కలెక్టరేట్ ఎదుట భిక్షాటన చేస్తున్న రవీందర్‌రావు

## కలెక్టరేట్ ఎదుట మాజీ సర్పంచ్ భిక్షాటన

- పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్

హనుమకొండ, ఏప్రిల్ 21: పెండింగ్ బిల్లులు చెల్లించాలని హనుమకొండ కలెక్టరేట్ ఎదుట సోమవారం నడికూడ మాజీ సర్పంచ్ ఊర రవీందర్‌రావు భిక్షాటన చేస్తూ నిరసన తెలిపాడు. అనంతరం రవీందర్‌రావు మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16నెలలు కావస్తున్నా ఒక్క బిల్లు రాకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశాడు. బిల్లుల విడుదల కోసం ఎన్నిసార్లూ విన్నవించిన పట్టించుకునే వారే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు విడుదల కాకపోవడంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించకలేక తీవ్ర ఇబ్బందులు పడు తున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ మెడలు వంచి ఈనెల 27లోగా ప్రభుత్వం నుంచి బిల్లులపై ప్రకటన వచ్చేలా ఒత్తిడి తేవాలని మాజీ సీఎం కేసీఆర్‌ను కోరారు.



కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలం రాజగూడాలో వాటర్ ట్యాంకు కింద తడకలు, చెక్కలతో ఏర్పాటు చేసి గుడిసెలో కొనసాగుతున్న పంచాయతీ కార్యాలయం

## వాటర్ ట్యాంక్ కిందే పంచాయతీ కార్యాలయం!

- ఏడాదిన్నరగా ఇదే పరిస్థితి
- స్థానికులకు తప్పని తిప్పలు

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ): మిషన్ భగీరథ నీటి ట్యాంకు కింద చుట్టూ తడకలు, చెక్కలతో నిర్మించిన ఈ చిన్న డేరా చూసి ఓ నిరుపేద కుటుంబానికి చెందినది కావచ్చు అనుకుంటారు. కానీ అందులో ఉన్నది ఒక గ్రామ పంచాయతీ కార్యాలయం అంటే ఆశ్చర్యపోవాల్సిందే. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలంలోని రాజగూడా గ్రామ పంచాయతీ కార్యాలయం దుస్థితి ఇది. కొత్త పంచాయతీగా ఏర్పడిన నాటి నుంచి రాజగూడా సర్పంచ్ జంగుబాయి ఇంట్లో పంచాయతీ కార్యాలయం కొనసాగింది. ఆమె పదవీ కాలం ముగియడంతో గ్రామంలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు కింద పిల్లర్లకు చుట్టూ తడకలు, చెక్కలతో చిన్న డేరాలో ఏర్పాటు చేశారు. దాదాపు ఏడాదిన్నరగా సిబ్బంది, గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నా అధికారులు, కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవని పలువురు విమర్శిస్తున్నారు.

### అద్దెకు ఇల్లు దొరకడం లేదు..

రాజగూడా చిన్న గ్రామం కావడంతో పంచాయతీ కార్యాలయం నిర్వహణకు అద్దెకు ఇల్లు దొరకడం లేదు. దీంతో మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు కింద తాత్కాలిక షెడ్‌వేసి పంచాయతీ కార్యకలాపాలను నిర్వహిస్తున్నాం. పంచాయతీ రికార్డులను సైతం ఇక్కడే భద్ర పరుస్తున్నాం. పక్కా భవన నిర్మాణం కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం.

– రాధాకిషన్ పంచాయతీ కార్యదర్శి, రాజగూడ

# ఇందిరమ్మ ఇల్లు రాలేదని కాంగ్రెస్ నేత ఆత్మహత్యాయత్నం

- పెట్రోలు పోసుకొని నిప్పంటించుకునేందుకు యత్నం
- అడ్డుకుని పోలీసులకు సమాచారం ఇచ్చిన స్థానికులు
- గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే ఘటన
- బాధితుడు మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు
- తనకే రాకుంటే.. అర్హులకు ఇండ్లే రావని స్పష్టీకరణ



బోనకల్లు పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఒంటిపై పెట్రోలు పోసుకుని ఆత్మహత్యకు యత్నించిన కాంగ్రెస్ నేత, మాజీ వైస్ ఎంపీపీ గుగులోతు రమేశ్

బోనకల్లు, ఏప్రిల్ 21: ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో తన పేరు రాలేదన్న ఆవేదనతో కాంగ్రెస్ నాయకుడైన మాజీ వైస్ ఎంపీపీ ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు వారించి ఆయన ప్రయత్నాన్ని అడ్డుకొని, పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకొని ఆత్మహత్యాయత్నానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఖమ్మం జిల్లా బోనకల్లు మండల కేంద్రంలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకున్నది. బోనకల్లు గ్రామ పంచాయతీ పరిధిలో కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ వైస్ ఎంపీపీ గుగులోత్ రమేశ్ ఏండ్లుగా కిరాయి ఇంటిలో నివాసం ఉంటున్నారు. ఇండ్ల జాబితాలో తన పేరు లేకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అనంతరం రమేశ్ పంచాయతీ కార్యాలయం వద్ద తన గోడు వెళ్లబోసుకున్నాడు. తాను కాంగ్రెస్ నాయకుడినని, కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ఇందిరమ్మ ఇల్లు వస్తుందని ఆశపడ్డానని చెప్పారు. అధికారులు, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా తనకు ఇల్లు మంజూరు కాలేదని వాపోయాడు. ప్రభుత్వ సర్వేలో తన ఇల్లు ఉన్నట్టుగా అధికారులు నమోదు చేశారని, కానీ తనకు ఇల్లే లేదని తెలిపారు. తన సోదరుడు శ్రీను ఇంట్లోనే ఎన్నో ఏండ్లుగా అద్దెకు ఉంటున్నానని తెలిపాడు. తనకు ఇంటి స్థలం ఉన్నప్పటికీ, గిరిజనుడిని అయినా ప్రభుత్వం తనకు ఇల్లు మంజూరు చేయకపోవడానికి కారణమేమిటో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తంచేశాడు.

### డిప్యూటీ సీఎంను కోరినా దక్కని ఫలితం

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామంటూ చెప్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. అర్హుడినైన, కాంగ్రెస్ ప్రజాప్రతినిధిగా పనిచేసిన తనకే ఇల్లు మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇల్లు మంజూరు చేయాలని సాక్షాత్తూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కోరానని, అయినా అయినా ఇండ్ల జాబితాలో తన పేరు లేకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు. తాను నమ్మిన తన కాంగ్రెస్ ప్రభుత్వమే తనను మోసం చేసిందని అన్నారు. అర్హుడినైన తనకే ఇందిరమ్మ మంజూరుకాకపోతే అసలైన పేదలకు ఇండ్ల రానేరావని స్పష్టం చేశారు.

## సిరిసిల్లలో మరో నేత కార్మికుడి ఆత్మహత్య

- బతుకు భారమై బలవన్మరణం




బలరాం (ఫైల్)

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ) : రాజన్న సిరిసిల్ల జిల్లాలో మరో నేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌కు చెందిన మరమగ్గాల కార్మికుడు బూర బలరాం (62) కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు బతుకమ్మ చీరలతో ఉపాధి పొందాడు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉపాధి లేక ఆగమయ్యాడు. బతుకమ్మ చీరలు బంద్ కావడం, మహిళా సంఘాలకు ఇచ్చే చీరలు పూర్తిస్థాయిలో పని కల్పించకపోవడం తో పనిలేక ఖాళీగా ఉం టున్నాడు. ఈ క్రమం లో రూ.5 లక్షల వరకు అప్పులు అయ్యాయి. బాకీలు తీర్చాలంటూ ఒత్తిళ్లు పెరిగాయి. ఓవైపు పని లేక.. మరోవైపు కుటుంబాన్ని పోషించలేక మనస్తాపంతో సో మవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నా డు. కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# టీచర్లకు సెలవుల్లేవ్!

- ఎవరూ హెడ్‌క్వార్టర్ విడిచి వెళ్లొద్దని ఆదేశాలు జారీ
- మే నెలలో రాష్ట్రంలోని టీచర్లందరికీ శిక్షణకు ఏర్పాటు
- ఈ నెలాఖరులోపు రిసోర్స్‌పర్సన్ల ఎంపికకు కసరత్తు
- పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి ఆదేశాలు జారీ
- విద్యా ప్రమాణాల మెరుగునకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు



హైదరాబాద్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ): మీరు ప్రభుత్వ ఉపాధ్యాయులా? 50 రోజుల వేసవి సెలవుల్లో ఫ్యామిలీస్‌తో ఎంచక్కా టూర్‌కో.. హాలిడే ట్రిప్‌కో వెళ్దామని ప్లాన్ చేసుకున్నారా? అయితే మీ ప్రణాళికలను వెంటనే రద్దు చేసుకోండి. ప్లాన్‌లో ఉంటే ఆపేసుకోండి. ఎందుకంటే ఈ వేసవి సెలవుల్లో ప్రభుత్వం మీకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ నుంచి ఆదేశాలు కూడా జారీ అయ్యాయి. రాష్ట్రంలోని ఉపాధ్యాయులందరికీ మేనెలలో ప్రత్యేక శిక్షణను ఇవ్వనున్నట్టు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి సోమవారమే ఆదేశాలను జారీచేశారు. ఈ మేరకు శిక్షణ దృష్ట్యా ఉపాధ్యాయులు ఎవరూ అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్ విడిచి వెళ్లవద్దని, సెలవులు మంజూరు చేయబోమని వివిధ జిల్లాల డీఈవోలు మండలాలకు ఆదేశాలను జారీచేశారు. కొన్నేళ్లుగా రాష్ట్రంలో పాఠశాల విద్యలో విద్యాప్రమాణాలు పడిపోతున్నాయి. న్యాస్, అసర్ సర్వేల్లో, పీజీఐ ఇండెక్స్ సహా ఏది తీసుకున్నా ప్రాథమిక, ఉన్నత అన్న తేడాల్లేకుండా విద్యార్థులు వెనుకంజలో ఉన్నారు. కొందరు విద్యార్థులు కనీసం చదవలేని, రాయలేని స్థితిలో ఉన్నారు. ఈ పరిస్థితి నుంచి బయటపడాలంటే తొలుత ఉపాధ్యాయులను చక్కదిద్దాల్సి ఉన్నది. బోధనను మెరుగుపరచాల్సి ఉన్నది. ఇప్పటికే వివిధ రాష్ట్రాలు ఇదే బాటలో పయనిస్తున్నాయి. ఢిల్లీలో సరికొత్త బోధనా మెళకువలను అనుసరిస్తున్నారు. కేరళలో డిజిటల్ విద్యపై టీచర్లకు శిక్షణనిచ్చారు. మహారాష్ట్రలో పాఠశాల స్థాయిలో ప్రమాణాలను అంచనాలు వేస్తున్నారు. ఇదే రీతిలో రాష్ట్రంలోని ప్రభుత్వ టీచర్లకు కూడా వివిధ సబ్జెక్టుల్లో బోధనా నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నారు.

### కలెక్టర్ల కమిటీకి ఆర్పీల ఎంపిక బాధ్యత

ప్రభుత్వ ఉపాధ్యాయులకు శిక్షణను ఇచ్చేందుకు తొలుత ఆర్పీ (రిసోర్స్‌పర్సన్)లను ఎంపికచేస్తారు. ఈనెల 30లోగా మండలం, జిల్లా పరిధిలో రిసోర్స్‌పర్సన్ల ఎంపికను పూర్తి చేస్తారు. ఈ ఎంపిక బాధ్యతలను జిల్లా కలెక్టర్, డీఈవో, డైట్, బీఈడీ, యూనివర్సిటీ అధ్యాపకులతో కూడిన కమిటీకి అప్పగించారు. డెమో, ఇంటర్వ్యూ ఆధారంగా ఆర్పీలను ఎంపికచేస్తారు. ప్రతి మండలం నుంచి ప్రతి సబ్జెక్టులో ఇద్దరు సెకండరీ గ్రేడ్ టీచర్లను రిసోర్స్‌పర్సన్స్‌గా ఎంపికచేస్తారు. జిల్లా పరిధిలో సబ్జెక్టుకు 2-4 వరకు స్కూల్ అసిస్టెంట్లను రిసోర్స్ పర్సన్లుగా అవకాశం కల్పిస్తారు. ఈ ఎంపిక తర్వాత మే నెలలో రాష్ట్రవ్యాప్తంగా శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

## బస్‌లో పుట్టిన పాప.. జీవితకాలం బస్‌పాస్

హైదరాబాద్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ) : ఆర్టీసీ బస్సులో జన్మించిన చిన్నారికి జీవిత కాలంపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉచితంగా ప్రయాణించేలా బస్‌పాస్ అందిస్తున్నట్టు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సోమవారం ప్రకటించారు. బస్‌లో కాన్పు చేసిన ఆశాకార్యకర్త మల్లి కాంతమ్మకు డీలక్స్, సూపర్ లగ్జరీ సర్వీసుల్లోనూ ఏడాదిపాటు ఉచితంగా ప్రయాణించే బస్‌పాస్ జారీ చేస్తున్నట్టు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. గర్భిణి సువర్ణ నాగర్‌కర్నూల్‌లో వైద్య పరీక్షలు ముగించుకుని హైదరాబాద్-కొల్లాపూర్ ఎక్స్‌ప్రెస్ బస్సులో 15న సొంతూరికి పయనమైంది. పెద్ద కొత్తపల్లి మండలం అదిరాల గ్రామ సమీపంలో బస్సులోనే ఆమెకు పురిటినొప్పులు రాగా, ఆశా కార్యకర్త మల్లి కాంతమ్మ ఆమెకు పురుడుపోయగా, ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. కండక్టర్ రాజ్‌కుమార్, బస్‌డ్రైవర్ వేణుగోపాల్, ఆశా కార్యకర్త మల్లి కాంతమ్మను సజ్జనార్ సన్మానించారు. వనపర్తి జిల్లా చిమనగుంటపల్లికి చెందిన సువర్ణ గ్రూప్-1 ఫలితాల్లో 179వ ర్యాంకు సాధించారు.

# ఇంటివద్దకే తేనీరా

నగరంలో ఆన్‌లైన్ అమ్మకాలు షురూ

- 250, 500 ఎంఎల్ టిన్లలో సరఫరాకు ఏర్పాటు
- ఇతర తాటి ఉత్పత్తుల విక్రయం
- త్వరలో వెబ్‌సైట్.. రాష్ట్రమంతా విస్తరణకు విస్తృత ప్రచారం
- ఫలిస్తున్న మాజీ సీఎం సంకల్పం




విక్రయానికి సిద్ధంగా ఉన్న నీరా టిన్లు

హైదరాబాద్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ): నీరా, ఇతర తాటి ఉత్పత్తుల అమ్మకాల ద్వారా కల్లుగీత వృత్తిదారులకు లబ్ధి చేకూర్చాలనే మాజీ సీఎం కేసీఆర్ సంకల్పం ఇప్పటికీ ఫలితాలను ఇస్తున్నది. ఆయన తీసుకొచ్చిన నీరా పాలసీని ప్రస్తుతం అప్‌గ్రేడ్ చేస్తున్నారు. ఇంటి వద్దకే నీరా వచ్చేలా ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తెచ్చారు. తెలంగాణ రాష్ట్ర కల్లుగీత పారిశ్రామిక కార్పొరేషన్ సంస్థ ఈకొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. ర్యాపిడో, ఓలా వంటి ఈ-బైక్ సర్వీసెస్‌లో ఈ-పార్శిల్ ద్వారా వినియోగదారులు కోరుకున్న చోటుకు నీరా డెలివరీ చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. తేనీరా కావల్సిన వారు 9121815999, 9666986888 నంబర్లకు కాల్ చేసి, ఎంత కావాలో చెప్పి, యూపీఐ ద్వారా నగదు చెల్లించి, లొకేషన్ పెడితే అక్కడికే తేనీరాను పంపుతున్నారు. ఇదివరకు బాటిళ్లలో నీరాను సరఫరా చేయగా, ప్రస్తుతం కోక్ మాదిరిగా 250 ఎంఎల్, 500 ఎంఎల్ టిన్ల మాదిరిగా సరఫరా చేస్తున్నామని నిర్వాహకులు చెప్తున్నారు. ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకున్న ఈ టిన్స్‌తోపాటు అవసరమైతే లీటర్ బాటిళ్లలో సరఫరా చేస్తున్నారు. అవసరమైతే పబ్స్, రెస్టారెంట్లుకూ సరఫరా చేస్తామని నిర్వాహకులు అంటున్నారు. త్వరలో తేనీరా కోసం ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను రూపొందిస్తామని, దానిద్వారా నీరాను, ఇతర ఉత్పత్తులను విక్రయిస్తామని నిర్వాహకులు తెలిపారు.

### త్వరలో ఉప ఉత్పత్తుల అమ్మకాలు

నీరాతోపాటు ఇతర తాటి ఉత్పత్తుల అమ్మకాలనూ చేపట్టనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. తాటి, ఈత బెల్లం, తాటి, ఈత సిరప్, పామ్ బూస్ట్, పామ్ గ్రాన్యుల్స్, తాటి ముంజలు, తాటి, ఈత పండ్లు, గేగులతోపాటు, ప్రత్యేకంగా తాటాకు, ఈతాకులతో తయారుచేసిన చాపలు, బుట్టలు, విసనగర్రలు, ఇంటి అలంకరణ వస్తువులను కూడా ఆన్‌లైన్ ద్వారా కూడా విక్రయిస్తామని నిర్వాహకులు చెప్పారు. వీటి విక్రయం వల్ల మరింత మంది గౌడ వృత్తిదారులకు ఉపాధి దొరుకుతుందని భావిస్తున్నట్టు చెప్పారు. తాటి ఉత్పత్తుల విక్రయానికి సోషల్ మీడియాను ఉపయోగించుకుంటామని చెప్పారు.